క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని సోడమ్మ గుట్టపై వెలిసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమాధి నిష్టనొందిన పవిత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని పూలమాలలతో అలంకరించి, అభిషేకం తదితర పూజలు చేశారు. భక్తిగీతాలు, భజన కార్యక్రమాలు చేపట్టారు.

హిందూవాహిని కమిటీ ఎన్నిక

ఖిల్లాఘనపురం: మండల హిందూ వాహిని కమిటీని ఎంపిక చేసినట్లు విభాగ్ కన్వీనర్ అభిలాష్ హౌదేకార్ ఆదివారం తెలిపారు. మండల కన్వీనర్‌గా ప్రశాంత్, కో కన్వీనర్‌గా మోహన్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

ఆలయ భూమిలో నిర్మాణాల నిలిపివేత

పెబ్బేరు: పట్టణంలోని కిష్టారెడ్డిపేటలో ఆలయ భూమిలో చేపడుతున్న నిర్మాణాలను ఆదివారం దేవాదాయశాఖ అధికారులు వినయ్, మధు నిలిపివేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. 337 సర్వేనంబర్‌లో 2.26 ఎకరాల భూమి కొల్లాపూర్ ప్రధాన రోడ్డుకు అనుకుని ఉండడంతో గ్రామానికి చెందిన నేశ రాములు గతంలో కొనుగోలు చేసిన ప్లాట్లు, వీటిపై ప్రభుత్వం చేపట్టి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు చేయడంతో పాటు మున్సిపాలిటీ అధికారులు నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఆలయ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, సమస్య సివిల్‌కు సంబంధించిందని కోర్టులో చూసుకోవాలని తెలిపారు.


బడుసల గట్టుపైకి దారి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో బడుసల గట్టుపై ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు గురవుతున్నారు. విషయాన్ని గుర్తించిన సర్పంచ్ సత్యంయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్ కలిసి సొంత ఖర్చులతో గుట్టపై రహదారి పనులు ఆదివారం ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంకులు

- ఓవర్‌ఫ్లో ద్వారా నీటి వృథా



అమరచింత: పట్టణంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. స్థానిక దశమి కట్ట వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా నిత్యం ఓవర్‌ఫ్లో అవుతూ తాగునీరు వృథాగా పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ట్యాంకులోంచి నీరు రోడ్లపై పారుతుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, దశమికట్ట వద్ద నిత్యం వాటర్ ట్యాంకులు నిండుకుని నీరు రోడ్లపై పారుతున్న మిషన్ భగీరథ అధికారులు, స్థానిక వాటర్ లైన్‌మన్‌లు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి చర్య లు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి చెందిన మారెమ్మ ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆపరేషన్ చేయించుకుంది. ఆదివారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఆమెను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో ఆమె కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జానకీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, నిరంజన్, తిరుపతయ్య, బాలప్ప, రాములు తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని సక్కుబాయి శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. ఆదివారం విషయం తెలుసుకున్న ఎంపీపీ గాయత్రి, బీఆర్‌ఎస్ నాయకులు నరేష్‌నాయుడు, వెంకటేష్, సంపత్‌నాయుడు, బీఎస్పీ నాయకులు శ్రీనివాస్, రమేష్, బీసన్న పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్థికసాయం అందజేశారు.

ఘనంగా వాసవీమాత జయంతి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆత్మకూర్‌లో వాసవీమాత మూలవిరాట్



ఆత్మకూర్‌లో హోమం చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యాకపరమేశ్వరిదేవి జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుమారిపూజ, కలశాల ఊరేగింపు, అభిషేకం, చండీహోమం, కుంకుమార్చన, రాత్రి లక్ష పుష్పార్చన, మహా మంగళహారతి ఇతర పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని పురవీధులగుండా ఊరేగింపు చేపట్టి, భక్తులకు అన్నదానం చేశారు.

అమరచింత: కన్యాక పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలను పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య భవనంలో అమ్మవారి పటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేటారు. జయంతి సందర్భంగా మండలంలోని ఆర్యవైశ్య కుటుంబాలు పూజల్లో పాల్గొని ప్రత్యేక అభిషేకాలు చేశారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వాసవీమాత జయంతి మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సాయిసేవా సమితి, అయ్యప్పస్వామి భజన బృందం, ఆలయ కమిటీ సభ్యులు భక్తి పాటలతో భజన కార్యక్రమం చేపట్టారు.



ఆత్మకూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



అమరచింతలో..



పెబ్బేరులో..

కవి శ్రీశ్రీకి ఘన నివాళి



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని మర్రికుంటలోని గిరిజన బాలికల వసతి గృహంలో కవి శ్రీశ్రీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కవిత్వాలను గుర్తుచేశారు. అదేవిధంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంతో, మహిమలతో ప్రజలకు సత్య, అసత్యాల విలువలు నేర్పి మార్గనిర్దేశికుడయ్యాడని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాష్ అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలను టీజేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

తెలంగాణ భరోసా సభ పోస్టర్ల ఆవిష్కరణ

పాన్‌గల్: బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించే తెలంగాణ భరోసా సభ వాల్‌పోస్టర్లను ఆదివారం మండలంలోని కేతేపల్లి గ్రామంలో నాయకులు ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఉన్న సబ్బండ వర్గాలను పాలకులుగా చేయడానికి ఆత్మగౌరవంతో పోరాడుతున్న ఏకైక రాజకీయ పార్టీ బీఎస్పీ అన్నారు. బహుజనులందరికీ భరోసా కల్పించేందుకు నిర్వహిస్తున్న సభకు పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు తరలిరావాలన్నారు.

గోపాల్‌పేట: తెలంగాణ భరోసా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ అన్నారు. ఆదివారం కార్యకర్తలతో కలిసి రేవల్లి మండల కేంద్రంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మొదటిసారి పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి సభకు హాజరు కానున్నారని తెలిపారు.



పాన్‌గల్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

పాలమూరుకు తరలిన కాంగ్రెస్ నాయకులు



అమరచింత నుంచి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో పాలమూరులో నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు ఆదివారం తరలివెళ్లారు. టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయ్యుబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, తౌఫిక్, విష్ణు, శ్యాం, పలువురు ఉన్నారు.

ఆత్మకూర్: కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలకు నిరుద్యోగుల ఉసురుతగిలి కొట్టుకుపోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం నిరుద్యోగ నిరసన ర్యాలీకి పట్టణం నుంచి శ్రేణులు తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్రంలో గద్దనెక్కిన మోడీ, రాష్ట్రంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని అధికారం చేపట్టిన కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. రానున్న రోజుల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో తులసీరాజ్, రహమతుల్లా, పరమేష్, నల్లగొండ శ్రీను, రవీందర్, ప్రహ్లాద్ ఉన్నారు.

మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

పాన్‌గల్: మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించే మేడే ఉత్సవాలను కార్మికులు, కర్షకులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.

విరిగిపడిన చెట్టు



దర్గాపై పడిన చెట్టు

అమరచింత: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి శనివారం రాత్రి పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై చెట్టు విరిగి రాజావలి దర్గాపై పడడంతో పాక్షికంగా దెబ్బతింది. పట్టణ ప్రజలతో పాటు చెరువు ఆయకట్టు రైతులు భక్తి శ్రద్ధలతో దర్గాకు మొక్కులు చెల్లించుకునేవారు. వానలు రాని సమయంలో ఇక్కడ ఉన్న దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్విహించడం ఆచారంగా వస్తుంది. దర్గాను మరమ్మతు చేపట్టాలని చెరువు కట్టకింది రైతులు కోరుతున్నారు.

సంక్షేమ నిధిలో చేరండి



వనపర్తిటౌన్: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న కుటుంబ సంక్షేమ నిధిలో సభ్యులుగా చేరాలని జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ఒకరి కోసం అందరం, అందరి కోసం ప్రతి ఒక్కరం అనే లక్ష్యంతో పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకంలో చేరేందుకు కేవలం టీఎస్ యూటీఎఫ్ సభ్యులకు మాత్రమే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేటినుంచి వేసవి శిక్షణ శిబిరం

ఆత్మకూర్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని జాతర మైదానం మినీస్టేడియం ఆవరణలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కోచ్‌లు ఖాదర్, శ్రీధర్ తెలిపారు. 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డీఎస్‌డీఓ ఆదేశాల మేరకు వాలీబాల్, ఫుట్‌బాల్ శిక్షణలను ప్రారంభిస్తునట్లు పేర్కొన్నారు. ఆరేళ్ల నుంచి 16 ఏళ్ల వయస్సుఉన్న వారు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాలీవాన బీభత్సం



పిన్నంచర్లలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

- విరిగిపడ్డ చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా

ఆత్మకూర్: గాలివాన బీభత్సం సృష్టించడంతో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. చెట్లు రోడ్లకు అడ్డంగా విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. శనివారం మధ్యరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు కురిసిన అకాల వర్షానికి అతలాకుతలమైంది. చేతికొచ్చిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్, మండలంలోని పిన్నంచర్ల, మూలమల్లలో గాలి, వాన కారణంగా 20కిపైగా విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతోపాటు చెట్లు ఎక్కడబడితే అక్కడ విరిగిపడ్డాయి. మున్సిపాలిటీతోపాటు గ్రామాల్లో 24 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచింది. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నర్సింహులు తెలిపారు.



ఖానాపూర్‌లో నేలకూలిన విద్యుత్ స్తంభం



మూలమళ్లలో రోడ్డుపై పడిన స్తంభం



పిన్నంచర్లలో వ్యవసాయ పొలంలో పడిన స్తంభం

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, మహిళలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన 100వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. బూత్ స్వశక్తి కరణ్ యువ సంఘటనా అభియాన్, మహిళా చైతన్య యాత్ర, పార్టీ కార్యక్రమాలపై వివరించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయని రాబోయే రోజుల్లో కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. కార్యక్రమంలో రాకేష్‌యాదవ్, అన్వేష్, శివాజీ, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి



వీపనగండ్లలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి

వీపనగండ్ల: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో మొలకలు వస్తున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో మండల రైతు కమిటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిసిందన్నారు. ఏ గ్రామంలో కూడా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని అన్నారు. చాలా కేంద్రాలలో గన్నీ బ్యాగులు, లారీల సమస్యలు, తరుగు పేరుతో మోసాలు చోటు చేసుకుంటున్నాయని వీటిని తక్షణమే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో రాముడు, శివుడు, నాగరాజు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామసింహాల తరలింపు



అమరచింతలో కుక్కలను మినీ డీసీఎంలో వేస్తున్న ప్రత్యేక బృందాలు

సాక్షి ఎఫెక్ట్..

అమరచింత: మున్సిపాలిటీలో గ్రామ సింహాల స్వైర విహారం ఎక్కువైంది. ఆదివారం కుక్కల వేట కోసం నెల్లూరు జిల్లా నుంచి ప్రత్యేక బృందాలను మున్సిపల్ అధికారులు రప్పించారు. పట్టణంలో వీధి కుక్కల కాటుకు ప్రజలు గురవుతున్నారని సాక్షి దినపత్రికలో 'గ్రామ సింహాల స్వైర విహారం' కథనం ప్రచురితం కావడంతో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. పట్టణంలోని 8వ వార్డులోని మటన్ మార్కెట్‌లో కుక్కల దాడులు ఎక్కువయ్యాయని తెలియడంతో ముందస్తుగా ఆ వార్డులో పట్టుకున్నారు. మొదటి రోజు 122 కుక్కలను పట్టుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. పట్టణంలోని 10 వార్డులలో వారం రోజుల పాటు ప్రత్యేక బృందాలతో వీధి కుక్కలను పట్టుకోనేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు వేయండి మహాప్రభో..

కొత్తకోట రూరల్: రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తండావాసులు వాపోతున్నారు. మండలంలోని బుగ్గపల్లితండాకు 2019లో మంత్రి నిరంజన్‌రెడ్డి రూ.156లక్షల నిధులతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తండాకు బీటీ రోడ్డు వస్తుందని సంబరపడ్డ తండావాసుల సంతోషం ఆవిరైపోయింది. పనులు ప్రారంభమై మట్టివేసి రోడ్డు చదును చేశారు. మూడేళ్లుగా పనులు నిలిచిపోయాయి. వేసిన రోడ్డు గుంతలు పడి ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు.



గుంతలమయంగా బుగ్గపల్లితండా రోడ్డు

అవినీతి ఎమ్మెల్యేలపై కేసు నమోదు చేయాలి



మదనాపురంలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిన్నంబావి: దళితబంధు పథకంలో కమీషన్లు దండుకున్న ఎమ్మెల్యేలపై హైకోర్టు సుమోటో కేసు స్వీకరించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రంజిత్‌కుమార్, నర్సింహ, శివకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడుతున్న ఎమ్మెల్యేల చిట్టా విప్పాలని మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు జగదీష్ మాట్లాడుతూ దళితబంధు లబ్ధిదారుల వద్ద ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకోవడం సిగ్గుచేటని అన్నారు. చిట్టా బయటపెట్టి ముఖ్యమంత్రి నిజాయితీని చాటుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెద్దమందడి జెడ్పీహెచ్‌ఎస్‌లో పూర్వ విద్యార్థులు



మందాపూర్‌లో ఉపాధ్యాయులతో ..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలో జెడ్పీహెచ్‌ఎస్ 1998–99లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 25ఏళ్ల తర్వాత ఆదివారం పాఠశాలలో కలిశారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు శివ, రాజలింగం, సత్యనారాయణ, కృష్ణయ్య, ప్రభాకర్, భీంరెడ్డి, వరలక్ష్మిని పాద సేవ చేసి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

మాందాపూర్‌లో..

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 2005లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకున్నారు. తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో చదవిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారి గురువులను సన్మానం చేశారు.

జనచైతన్యం కోసమే యాత్రలు

వనపర్తి: సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగించేందుకే జన చైతన్య మోటార్ సైకిళ్ల ర్యాలీలు నిర్వహిస్తున్నామని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు మోటార్ సైకిళ్ల ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఏప్రిల్ మాసంలో 120 జనావాస ప్రాంతాల్లో జన చైతన్య మోటార్ సైకిళ్ల యాత్రలు నిర్వహించినట్లు తెలిపారు. ఆహారం, దుస్తులు, ఆచారం, భాషా ప్రామాణాలను పక్కన పెట్టి మనిషిని మనిషిగా ప్రేమించే సమాజాన్ని నిర్మించాలని కోరారు. రాజ్యాంగాన్ని, ప్రభుత్వం రంగ సంస్థలను, రిజర్వేషన్లను కాపాడుకోవడానికి మహనీయుల సందేశం స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని జన చైతన్య యాత్రలు చేస్తామన్నారు. కార్యక్రమంలో భగత్, వెంకట్రాములు, గట్టన్న, బీసన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు